క్లుప్తంగా

నేడు నూతన పింఛన్ల పంపిణీ

జే.పంగులూరు: మండల పరిధిలోని నూతన పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం నేడు పంగులూరు మార్కెట్ యార్డులో ఇవ్వనున్నట్లు ఆదివారం ఎంపీడీవో రామాంజినేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పానెం హనిమిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి లబ్ధిదారులు హాజరు కావాలని తెలిపారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

మార్టూరు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా నేటి నుంచి మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీ నితిన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయల్ హైస్కూలుతో పాటు వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 10వ తేదీ నుంచి 18 వరకు ఆటల పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మండల స్థాయి విజేతలు తరువాత పర్చూరులో జరుగనున్న నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దారు ఎస్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు అవసరమైన అర్జీలు పెట్టుకోవచ్చన్నారు.

11న మార్టూరులో జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులో వివేకానంద నెక్స్‌జెన్ పాఠశాలలో ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ వేలూరి కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల, పల్నాడు జిల్లాల స్థాయిలో నిర్వహించనున్న పోటీల్లో 7వ తరగతి లోపు బాలికలు జూనియర్ విభాగంలోనూ 8, 9, 10వ తరగతి బాలికలు సీనియర్ విభాగంగానూ ముగ్గుల పోటీలు నిర్వహిస్తారని ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు.

ధర్మాలు ఆచరిస్తే జీవితాలు ధన్యం

చీరాల రూరల్: సత్యం, ధర్మం, అర్థం, మోక్షం వంటి జీవిత సత్యాలను ఆచరిస్తే మన జీవితాలు ధన్యమవుతాయని అవధాన కళానిధి, సంస్కృత ఉపన్యాసకుడు తిరుపతికి చెందిన ఆముదాల మురళి అన్నారు. ఆధ్యాత్మిక పీఠం చీరాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక స్వర్ణ రోడ్డులోని లయన్స్ క్లబ్ ట్రస్టు బిల్డింగ్‌లో యక్ష ప్రశ్నలు అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని భక్తులకు తన ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. మానవ జీవన విధానం అర్థవంతంగా సాగేలా జీవన మర్మాలను చర్చిస్తూ మనిషి జీవితం ఆదర్శప్రాయంగా ఉండాలని పురాణ ఇతిహాసాలు, నీతి కథలు మనకు అందించాయని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వి. వెంకటరావు, డాక్టర్ వెంకట్రావు, అమరా వెంకట రాఘవరావు, మువ్వల శివ ప్రసాద్, పబ్బిశెట్టి రామారావు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

చీరాల రూరల్: రైట్ నెట్‌వర్క్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైకుంఠపురంలోని గౌడ కళ్యాణ మండపంలో స్టెప్ టు గో సోషల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ నాగూర్ బాబు, డాక్టర్ ప్రశాంత్‌లు పాల్గొని వైద్య సేవలందించారు. ఈ వైద్య శిబిరంలో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడారు. మార్చి 8వ తేదీ మహిళా దినోత్సవం వరకు మహిళలందరికీ ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులపై రాయితీ కూడా అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కె. రామకృష్ణ, ఎస్. శేషగిరిరావు, యోగేంద్ర, సిహెచ్. శ్రీకాంత్, సందీప్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షతలు పంపిణీ



అక్షతలతో గ్రామోత్సవం చేస్తున్న గ్రామస్తులు

బల్లికురవ: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షతలను ఆదివారం రాత్రి బల్లికురవలో గ్రామోత్సవంతో ఇంటింటా పంపిణీ చేశారు. గ్రామంలోని పోలేరమ్మ ఆలయం నుంచి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించి ప్రతి ఇంటా అక్షతలతోపాటు ప్రతి ఇంటా శ్రీరాముడి ఆలయ ఫోటోను పంపిణీ చేశారు. గ్రామోత్సవంలో సుమారు 600 కుటుంబాలకు అక్షింతలు ఫొటోలు పంపిణీ చేశారు. ఈ గ్రామోత్సంలో గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

☛ చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొణిజేటినగర్‌కి చెందిన అంగడి ప్రసన్నకుమారి ఆమె కుమారుడిని స్కూటీపై తీసుకొని చీరాల వైపు వెళ్తోంది. అదే సమయంలో అమరావతి నుంచి స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల్లో పోటీ పరీక్షలు రాయడానికి కారు విద్యార్థులు వస్తున్నారు. జాతీయ రహదారి బైపాస్ నుంచి కళాశాలకు వెళ్లే మలుపులో కారు స్కూటీని ఢీకొట్టింది. స్కూటీ నడుపుతున్న మహిళ రోడ్డుపై పడి కాలు పూర్తిగా విరిగి తీవ్ర గ్రాయాల పాలయింది. స్కూటీ వెనక వైపు కూర్చున్న కుమారుడు ఎగిరి కింద పడ్డాడు. వెంటనే హైవే పెట్రోలింగ్ వాహనం వచ్చి 108కి సమాచారం అందించారు. కొద్ది నిమిషాలకే అక్కడి వచ్చిన 108లో గాయపడిన మహిళను, కుమారుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి తక్షణ వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు.

☛ వేటపాలెం రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసం ఉండే కావూరి సాంబయ్య 70 ఏళ్ల వృద్ధుడు. ప్రతి రోజు ఉదయాన్నే వన్‌వే రోడ్డు పక్కగ గల శివాలయానికి వెళ్తుండేవాడు. శివాలయం ఇంటి పక్కనే పూలు కోసుకోవడానికి వెళ్లాడు. వృద్ధుడు గోడ పక్కనే ఉన్న సెప్టిక్ ట్యాంక్ పైకి ఎక్కి పూలు కోసుకొంటున్న సమయంలో ట్యాంక్ మూత విరిగి పోయింది. దీనితో సాంబయ్య సెప్టిక్ ట్యాంక్ గుంతలో పడిపోయాడు. చుట్టపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. లోతైన గుంత కావడంతో క్రేన్ తెప్పించి గుంటలో పడిని వృద్ధుడిని బయటకు తీశారు. కాళ్లు రెండు విరగడంతో వెంటనే 108 సమాచారం అందించగా తక్షణం వచ్చిన అంబులెన్స్ చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి తక్షణ చికిత్స చేయించారు.



ప్రమాదంలో గాయపడిన వారిని 108లో తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

కుయ్ కుయ్ అంటూ..
ప్రాణాలు రక్షిస్తూ

- పేదల సంజీవనులు.. ఆరోగ్య రథాలు
- వైద్య సేవలకు ఊపిరి పోసిన ప్రభుత్వం
- విశేష సేవలందిస్తున్న 108, 104 వాహనాలు

వేటపాలెం: ఎక్కడైనా ప్రమాదం జరిగితే చాలు కుయ్ కుయ్ కుయ్‌మని పది నిమిషాల్లో అక్కడకు చేరుకొని ఆదప నుంచి రక్షిస్తున్నాయి. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఎంతో మంది ప్రాణాలను కాపాడిన ఘనత 108ది. 24 గంటలు సేవలందిస్తూ బాధితుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. 108 అంబులెన్స్, ఇక పల్లెల్లోనే ప్రజల వద్దకే వైద్య సేవలు అందించే 104 సంచార వైద్య వాహనం ఇవన్నీ ఆరోగ్య రథాలుగా పేదల సంజీవనిలా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నాయి.



వృద్ధుడికి ఇంటి వద్దనే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బాలరాజు (ఫైల్)

గత ప్రభుత్వం హయాంలో నిర్వీర్యమైన 108..

దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆనాడు ప్రవేశ పెట్టిన, 108, 104 వాహన సేవలను గత టీడీపీ పాలనలో నిర్వీర్యం చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో తీవ్ర నిర్లక్ష్యంతో ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను వైద్యశాలకు తరలించే పరిస్థితి లేక ప్రాణాలపై ఆశలు వదిలేసుకోవాల్సిన దుస్థితి ఉండేది. కానీ తర్వాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ అత్యవసర సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

ఆధునిక హంగులతో అత్యవసర సేవలు..

నియోజకవర్గ పరిధి చీరాలలో, వేటపాలెం మండలంలో అధునిక సౌకర్యాలతో 108, 104 ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయి. జాతీయ రహదారి, బైపాస్ రోడ్డు, చీరాల-ఒంగోలు రహదారులలో ఏదైనా ప్రమాదం జరిగితే క్షణాల్లోనే క్షతగ్రాతులను హాస్పిటల్‌కు చేర్చి ప్రాణాలను రక్షిస్తున్నారు. అంబులెన్స్‌లోనే ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండడంతో ప్రమాదంలో తీవ్రగాయాలైనా ప్రథమ చికిత్స అందిస్తూ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. 104 ద్వారా ప్రతి గ్రామ సచివాలయానికి వెళ్లి రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, గర్భిణులకు ఇది వరంగా మారింది. ప్రతి నెలా 108 ద్వారా 118–120 మంది క్షతగాత్రులను, వివిధ కారణాలతో బాధపడే రోగులను కాపాడుతున్నాయి. 104 ద్వారా వైద్యులు ప్రతినెలా గ్రామాల్లో 18 శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు.



104 ద్వారా వైద్య శిబిరం నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యులు (ఫైల్)

> **వైద్యులు అందుబాటులో ఉంటున్నారు..**
> ప్రభుత్వ వైద్యులు 104లో గ్రామానికి వచ్చి అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇస్తున్నారు. గతంలో బీపీ పరీక్ష చేయించుకోవాలంటే ప్రైవేటు ఆర్ఎంపీ వైద్యుల వద్దకు వెల్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నెలకు రెండు సార్లు వచ్చి పరీక్షలు చేసి బీపీ, షుగర్ మందులు నెలకు సరిపడా ఉచితంగా ఇస్తున్నారు.
> పీ వెంకటేశ్వర్లు, లక్ష్మీపురం, అక్కాయిపాలెం

> **గ్రామీణ ప్రజలకు చేరువలో వైద్యం..**
> 
> గతంలో గ్రామాల నుంచి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక వైద్య శాలకు వచ్చి వైద్య సేవలు పొందాల్సి ఉండేది. అయితే ప్రస్తుతం 104 వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వారికి దగ్గరలోనే వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. ఉచితంగా అన్ని రకాల పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నాం. ప్రతి నెల 18 క్యాంపుల దాకా నిర్వహిస్తుంటాం. ప్రభుత్వం ఫ్యామిలీ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ప్రజలకు ప్రభుత్వ వైద్యులపై నమ్మకం ఏర్పడింది.
> శ్యాంసన్, వైద్యాధికారి, వేటపాలెం

వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేత

అద్దంకి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ఎంత ఉపయోగపడుంతో అందిరికీ తెలిసిందే. మండలంలోని చిన్నకొత్తపల్లికి చెందిన గెల్లా సత్యావాదమ్మ అనారోగ్యంతో గుంటూరులోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. పింఛన్ కోసం అందుబాటులె లేకపోవడంతో వలంటీర్ గెల్లా అనూష అక్కడికి వెళ్లి ఆదివారం పింఛన్ అందజేసింది. అలాగే అద్దంకి పట్టణంలోని 9వ సచివాలయ పరిధిలోని 19వ వార్డుకు చెందిన అరిగెల హైమావతి ఒంగోలులోని వైద్యశాలలో చికిత్స పొందుతోంది. దాంతో పింఛన్ సమయంలో రాలేకపోవడంతో వలంటీరు మేదర గంగా భవానీ కుమార్ వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేశాడు. దీంతో లబ్ధిదారులు, పలువురు వలంటీర్లను అభినందించారు.



పింఛన్ అందజేస్తున్న వలంటీరు అనూష



పింఛన్ అందజేస్తున్న వంలంటీరు భవానీ కుమార్

గిరిజనుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



గిరిజన శంఖారావానికి తరలివెళ్తున్న గిరిజన నాయకులు

చీరాల టౌన్: గిరిజనుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ గిరిజనుల నాయకులు పేర్కొన్నారు. గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన గిరిజనుల శంఖారావానికి చీరాల నుంచి గిరిజన నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. గిరిజన నాయకుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మొగిలి బాబ్జి ఆధ్వర్యంలో చీరాల నుంచి వాహనాల్లో తరలివెళ్లారు. ఈసందర్భంగా బాబ్జి మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటుగా గిరిజనులకు మంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవులు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. రాష్ట్రంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం, టీటీడీలో, శ్రీశైలం దేవస్థాన పాలకమండలిలో గిరిజనులకు స్థానం కల్పించి ఎనలేని మేలు చేశారన్నారు. స్టువర్టుపురంలో ఏకలవ్యుడి విగ్రహానికి గిరిజన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన గిరిజన నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



ప్రత్యేక అలకరంణలో వేంకటేశ్వరస్వామి



సుదర్శన హోమం నిర్వహిస్తున్న పండితులు

వేటపాలెం: ధనుర్మాసం పూజల్లో భాగంగా మార్గశిర ఏకాదశిని పురస్కరించుకొని పవిత్రమైన సుదర్శన హోమం వైభవంగా ఆదివారం నిర్వహించారు. రావూరిపేటలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవస్వామి దేవస్థానంలో హోమం చేస్తున్నారు. రుత్వికులు అలహరి వెంకట జనార్ధనమూర్తి మాట్లాడుతూ శ్రీమన్నారాయణుడు తన సుదర్శన చక్రంతో శత్రుసంహారం చేశారన్నారు. అందుకే పంచమత స్తోత్రాలలో మొదట స్తోత్రం సుదర్శన చక్రానికి చేస్తారని తెలిపారు. అనేక కుటుంబ సమస్యలకు పురాణాల్లో తెలిపే పరిష్కారం మార్గం సుదర్శన హోమం అన్నారు. విష్ణుమూర్తి సుదర్శన చక్రానికి పంచాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సుదర్శన హోమంలో పాలు పంచుకొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పన చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

షుగర్ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు

చీరాల అర్బన్: షుగర్ వ్యాధిపై రోగులు అశ్రద్ధ చేస్తే అనేక దుష్ఫలితాలు ఏర్పడతాయని షుగర్ వ్యాధి వైద్యనిపుణుడు డాక్టర్ విక్రమ్ అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆరోగ్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు గాదె హరిహరరావు అధ్యక్షత వహించారు. షుగర్ రోగులు తరచుగా రక్త, మూత్ర పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన మేరకు మందులు వాడాలన్నారు. అలానే నడక, వ్యాయామాలు, యోగా వంటివి చేయడం వలన షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుందన్నారు. అనంతరం పాల్గొన్న వారికి రక్తపరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినయ్‌కుమార్ కార్యదర్శి ఎ.రామారావు, సింహాద్రి యల్లమందారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగవీరభద్రాచారి, రాష్ట్రకార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ విక్రమ్

ఈవీఎంలపై అవగాహన

బల్లికురవ: ఓటర్లు ఈవీఈఎంలపై పూర్తి అవగాహనతో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని మాస్టర్ ట్రైనీ దాసరి ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పరపాడు, కొమ్మినేనివారిపాలెం గ్రామాల్లో ఈవీఎంలపై ఓటర్లకు పలు సెంటర్లలో అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగంతో ప్రశ్నించే హక్కు కలుగుతుందన్నారు. అవగాహన లేకుండా ఓటు వేస్తే ఆ ఓటు చెల్లకపోవడంతో పాటు మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం కోల్పోతారని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు వై శ్రీనివాసరావు, సాయి విమల్ తదితరులు పాల్గొన్నారు.



కొప్పరపాడులో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనీ

రేపటి నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు

కారంచేడు: ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మరలా మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు కూడా ఈ సెలవులు వర్తిస్తాయన్నారు. పైతేదీల్లో ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మరలా తిరిగి 19వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ప్రకనటలో తెలిపారు.

అయోధ్య ఆహ్వాన పత్రిక అందజేత

చీరాల అర్బన్: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ మందిర ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను కారంచేడులోని ప్రణవానందగిరి స్వామిజీకి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు, విశ్వహిందు పరిషత్ సభ్యులు ఆదివారం అందించారు. అయోధ్య నుంచి వచ్చిన ఆహ్వాన పత్రికను స్వామిజీకి అందించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ శివనారాయణ, జిల్లా ప్రముఖ్ జి.తులసీరావు, చీరాల నియోజకవర్గ బాధ్యులు కె.మహేష్, చుండూరి అశోక్‌కుమార్, దర్శి శ్రీనివాసరావు, అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్వామిజీకి ఆహ్వానపత్రిక అందిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన రాతి ముఖ మండల నిర్మాణం ప్రస్తుతం జరుగుతోంది. దానికిగాను సాయంగా రావుపల్లి వెంకాయమ్మ జ్ఞాపకార్థం మనవడు సిద్ధయేగయ్య రూ.10,116 విరాళంగా సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య సమక్షంలో దేవస్థాన ఈవో సుభద్రకు ఆదివారం అందజేశారు.



విరాళం అందజేస్తున్న దాత

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు. అలానే మండల తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. సమావేశానికి సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలని తహశీల్దార్ సూచించారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి రూరల్: అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న బెల్టు షాపుపై దాడి నిర్వహించి 12 మద్యం బాటిళ్లను ఆదివారం ఎస్సై వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలంలోని గోవాడ గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావటంతో ఎస్సై సిబ్బందితో దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

6 మద్యం బాటిళ్లు స్వాధీనం

బల్లికురవ: ఇంట్లోనే బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం బల్లికురవ ఎస్సై వీ వేమన సిబ్బందితో దాడులు చేశారు. మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామంలో సారెడ్డు వెంకయ్య నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

బల్లికురవ: మార్గశిర మాసం సఫల ఏకాదశి సందర్భంగా ఆదివారం మండలంలో వాడవాడలా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలతోపాటు అలంకరించారు. బల్లికురవ, కొత్తపాలెం, గుంటుపల్లి,అంబడిపూడి, వల్లాపల్లి, గ్రామాల్లోనిపోలేరమ్మ,మహాలక్ష్మమ్మ, రేణుకమ్మ, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సమీపంలోని ఈర్లగంగమ్మ ఆలయంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొని తమ తమ మొక్కులు తీర్చుకున్నారు.

లారీని ఢీకొన్న మోటారు బైకు



గాయపడిన గ్రీకు

మేదరమెట్ల: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన మోటారు బైకు ఢీకొన్న ఘటనలో బైకిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన శనివారం అర్ధరాత్రి తమ్మవరం రోడ్డు ఫ్లైవర్ వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ఒంగోలుకు చెందిన గ్రీకు అతని స్నేహితుడు ఇద్దరూ కలిసి అద్దంకికి మోటారు బైకుపై బయలుదేరారు. ఈక్రమంలో మేదరమెట్ల జాతీయ రహదారి తమ్మవరం రోడ్డు ఫ్లెటైవర్ బ్రిడ్జి వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని బైకు ఢీకొంది. దీంతో బైకుపై ఉన్న ఇరువురు కింద పడిపోయారు. బైకు నడుపుతున్న గ్రీకు తలకు తీవ్రగాయమైంది. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు క్షతగాత్రుడి ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన సమాచారాన్ని మేదరమెట్ల పోలీసులకు తెలిపారు.